క్లుప్తంగా

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



విద్యార్థితో పుస్తకం చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చదవించడం, చెప్పించడం వంటివి చేయించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి కాసేపు మాట్లాడారు. పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానం అలవడుతుందన్నారు. ప్రతీ విద్యార్థి చదువుపై మక్కువ పెంచుకోవాలని, విద్యతోనే ఉన్నత భవిష్యత్ సాధ్యమన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 48 మంది ఎంపిక



నేత్రవైద్య తనిఖీలు చేస్తున్న వైద్యుడు

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి 95 మంది రోగులకు హాజరు కాగా, వీరికి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి వైద్యులు కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. 48 మందికి నేత్ర శస్త్రచికిత్స అవసరమని, బస్సులో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు దేవరపు సురేష్, కార్యదర్శి పి.సతీష్, క్యాంపు కో–ఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధాన్యం విక్రయాలు



ట్రాక్టరులో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్న ధాన్యం బస్తాలు

రేగిడి: మండలంలో ధాన్యం విక్రయాలు కొనసాగుతున్నాయని ఏవో గురుగుబిల్లి మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. పంట కోసిన అనంతరం నూర్పిడి చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలిస్తున్నారన్నారు. చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చెప్పిన మాట ప్రకారమే కొనుగోలు ప్రక్రియ జరుగుతోందన్నారు.

రూ.50 లక్షలతో శివాలయం నిర్మాణం



నిర్మాణ దశలో చిన్నపుర్లి శివాలయం

రేగిడి: మండలంలోని చిన్నపుర్లి గ్రామంలో రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా శివాలయం నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కావస్తుండడంతో ఆ తర్వాత జరిగే ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట, పూజలకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకువస్తామని గ్రామస్తులు చెబుతున్నారు.

రుణాల రికవరీ చేపట్టాలి



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం చక్రపాణి

వంగర: వెలుగు శాఖ ద్వారా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాల రికవరీ చేపట్టాలని ఏపీఎం మీసాల చక్రపాణి సూచించారు. ఆదివారం మండలంలోని అరసాడ గ్రామంలో గ్రామైక్య సంఘం పరిధిలో సభ్యులు వాడుకున్న స్త్రీనిధి, సీఐఎఫ్ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలపై ఆరాతీశారు. సభ్యులంతా సకాలంలో రుణాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వీవోఏలకు తెలిపారు.

అన్నదానం

రాజాం: మండలంలోని మారేడుబాక గ్రామంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించే భక్తులు ఈ కార్యక్రమం చేపట్టగా, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ ఈ కార్యక్రమం ప్రారంభించి, గ్రామస్తులకు అన్న ప్రసాదం వడ్డించారు.

పాలన నచ్చే పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి, స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన నచ్చడంతోనే పార్టీలో రోజురోజుకూ చేరికలు ఎక్కువవుతున్నాయని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. మండలంలోని పనసలవలస గ్రామంలో టీడీపీకి చెందిన పలువురు ఆయన సమక్షంలో వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలు వేసి, స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని, ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించాలన్నారు. పార్టీలో చేరిన వారిలో ఆబోతుల తిరుపతిరావు, ఇజ్జాడ కృష్ణ, నారు గోపాలం, బూరాడ గోపాలం, మంతిన అప్పలరాములు, గేదెల సత్యంనాయుడు, మీసాల రాము, బోద్రుతు గణలతో పాటు మరో 50 కుటుంబాలు ఉండగా, తామంతా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులయ్యే పార్టీలో చేరామన్నారు. నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి అయోమయంగా ఉందని, ఇప్పటివరకు ఆ పార్టీ తరఫున సరైన నాయకుడు లేడని, తరచూ పార్టీలో వివాదాలు తలెత్తడం, సముచిత గౌరవం దక్కనందువల్లే పార్టీని వీడామన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే ప్రధానంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహన్‌రావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్‌కుమార్, సర్పంచ్‌లు వియ్యపు చక్రపాణి, పేడ్డా బాబూరావు, ఎంపీటీసీలు రెడ్డి నర్సింగరావు, మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి సీహెచ్‌సీకి రోగుల తాకిడి



బాడంగి సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

బాడంగి: స్థానిక సీహెచ్‌సీకి రోగుల తాకిడి ఎక్కువైంది. ఆదివారం అయినా రోగుల రాక ఏమాత్రం తగ్గలేదని సిబ్బంది చెబుతున్నారు. ఆస్పత్రిలోని 30 పడకలు రోగులతో నిండిపోగా, మరే ఏ ఒక్కరూ ఉండడానికి వీలులేని పరిస్థితి. ఈ నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప రోగిని ఆస్పత్రిలో ఉంచడం లేదు. సాధారణంగా ఆదివారం డ్యూటీ డాక్టర్ తప్ప స్పెషలిస్టు వైద్యులు ఉండరనే కారణంతో రోగులు ఎవరూ అంతగా ఆస్పత్రికి రారు. ఈసారి మాత్రం గతంలో కన్నా భిన్నంగానే వైద్యసేవలకు వచ్చే రోగుల సంఖ్య అధికంగానే ఉందని, వీరందరికీ డ్యూటీ డాక్టర్ సుచరిత వైద్యసేవలందించారని సిబ్బంది తెలిపారు. సెలవు రోజు కూడా వైద్యసేవలు లభిస్తుండడంతో ఆస్పత్రిని ఆశ్రయించే రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

17 నుంచి సప్త శనివారాల ఆరాధన

బాడంగి: మండలంలోని కోడూరులో ఉన్న కోడూరుమాత పుణ్యక్షేత్రంలో ఈ నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సప్త శనివారాల ఆరాధన కార్యక్రమం చేపడుతున్నట్లు ఫాదర్ యుగల్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. ప్రతీ శనివారం అఖండ జపమాల, శిలువమార్గం, దివ్యసత్ప్రసాద ఆరాధన, వాక్య పరిచర్య, దివ్యబలి పూజ, ప్రేమవిందు వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు. మార్చి 9వ తేదీన పాపపశ్చాత్తాప పాదయాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



మరుగుదొడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

వంగర: మరుగుదొడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో వై.దుర్గారావు సూచించారు. ఆదివారం మండలంలోని మెట్టుమగ్గూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు పరిశీలించి, పలు సూచనలు చేశారు. వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తిచేసి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు జగన్మోహనరావుకు తెలిపారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండలంలోని సంకిలి గ్రామ నాగావళి నదీ తీరాన సత్యసాయి సాధనా శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరణు వేడుకున్న భక్తులను భగవంతుడు ఎల్లవేళలా కాపాడతారన్నారు. దైవనామస్మరణలో నిత్యం ప్రజలు ఉండాలన్నారు. అందరూ ఆధ్యాత్మిక బాటలో నడిస్తే మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు. కార్యక్రమంలో కె.సుధాకరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, జి.శ్రీరాములు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హిందీ పరీక్షలు



పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు

రేగిడి: మండలంలోని పెనుబాక గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రెండు రోజులుగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ మద్రాసు ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర, ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలకు సంబంధించి, మొత్తం 174 మందికి గాను 172 మంది హాజరైనట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు తెలిపారు. ఆదివారం జరిగిన పరీక్షలను ఎంఈవో దుర్గారావు పరిశీలించి, పరీక్షలు బాగా రాయాలని అభ్యర్థులకు సూచించారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎ.మహేశ్వరరావు, ఇన్విజిలేటర్లుగా పి.మధుసూదనరావు, పి.బలరామ్మూర్తి, రమణ, శారద, లక్ష్మి తదితరులు వ్యవహరించారు. ఈ పరీక్షలకు రాజాం మండలంతో పాటు వంగర, రేగిడి, సంతకవిటి, చీపురుపల్లి, తెర్లాం, జి.సిగడాం మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

పరీక్షలన్న భయం వీడాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఐ లోవరాజు

బొబ్బిలి: స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు పునశ్చరణ తరగతులు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌ఐ జి.లోవరాజు హాజరై, ఎలా పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్న అంశంపై అవగాహన కల్పించారు. సాధారణంగా పబ్లిక్ పరీక్షలు అనగానే విద్యార్థుల్లో ఒకరకమైన భయం నెలకొంటుందని, ముందు ఆ భయం వీడాలని తెలిపారు. ధైర్యంగా పరీక్ష కేంద్రాలకు వెళ్తేనే పరీక్ష బాగా రాయగలమన్నారు. భయం ఉంటే కొన్ని ప్రశ్నలకు సమాధానాలు మర్చిపోతామన్నారు. ప్రతీ విద్యార్థి ధైర్యంగా పరీక్షలు రాయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామ్మూర్తి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కంటెయినర్ ఇల్లండి.. చాలా చవకండి!



చూపరులను ఆకట్టుకుంటున్న కంటెయినర్ ఇల్లు

రేగిడి: మండలంలోని పెద్దపుర్లి గ్రామంలో కంటెయినర్ ఇల్లు పలువురిని ఆకట్టుకుంటోంది. గ్రామానికి చెందిన కె.పాపినాయుడు కేవలం రూ.1.50 లక్షల ఖర్చు పెట్టి, ఈ ఇంటిని నిర్మించుకున్నాడు. విశాఖలో నివాసముంటున్న ఈయన గ్రామంలోని తన పొలాలను చూసేందుకు తరచూ వస్తుంటారు. ఉన్నంతసేపు అయినా తనకంటూ ఉన్న ఇంట్లో ఉంటే బాగుంటుందన్న సదుద్దేశ్యంతో ఈ కంటైనర్ ఇంటిని ఏర్పాటు చేసుకున్నారు. కేవలం సెంటు భూమిలో ఉండే ఈ ఇంట్లో వంటగది, బెడ్ రూమ్, మెయిన్ హాల్ కూడా ఉండడం విశేషం.

కట్టిజనుము సాగుతో నేల సారవంతం



పాగిరి సమీపంలో పొలాల్లో సాగు చేస్తున్న కట్టిజనుము

రాజాం: మండలంతో పాటు సంతకవిటి, రేగిడి మండలాల్లో 7,300 ఎకరాల్లో కట్టిజనుము సాగు చేశారు. ఖరీఫ్ వరి ఉభాలు ముందు ఈ విత్తనాలను పొలాల్లో వేసి, మొక్కలైన తర్వాత దుక్కిచేసి వదిలేస్తారు. దీంతో నేల సారవంతమై, పంటలు బాగా పండుతాయి. ఈ నేపథ్యంలో ఈ విత్తనాలకు ఖరీఫ్ సీజన్‌లో డిమాండ్ విపరీతంగా ఉంటుంది. ఈ విత్తనాల కోసం ఇప్పుడు చాలా ప్రాంతాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 7 కిలోల విత్తనాలు చొప్పున ఉండాలి. ప్రస్తుతం కిలో విత్తనాలు ధర రూ.60 ఉండగా, క్వింటా విత్తనాలు ధర రూ.5 వేలు పైబడి పలుకుతోంది. ఎకరం పొలంలో ఎటువంటి పెట్టుబడులు లేకుండా పండిస్తే 5 క్వింటాల దిగుబడి వస్తోందని, వీటిని ఖరీఫ్ సీజన్‌లో అమ్మితే మంచి లాభాలు వస్తాయన్న ఆలోచనతో రైతులంతా కట్టిజనుము సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. పలు వ్యాపారులు కూడా రైతుల వద్ద వీటి విత్తనాలు కొనుగోలు చేసి, దుకాణాల్లో విక్రయిస్తుండడం విశేషం.

ప్రయోగ పరీక్షలు ప్రారంభం



రాజాం సిటీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రయోగ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 80 మందికి గాను 79 మంది విద్యార్థులు హాజరు కాగా గురుకుల కళాశాలలో 23 మందికి 23 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాళ్లు పి.శంకరరావు, టి.రామదాసు తెలిపారు. ఆయా కళాశాలల్లో రెండుపూటలా వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం ప్రాక్టికల్స్ జరిగాయన్నారు.

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు సంబంధించి, ప్రాక్టికల్ ఎగ్జామ్స్(ప్రయోగ పరీక్షలు) ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, వేదగాయత్రి కళాశాల, జీసీఎస్ఆర్, గాయత్రి కళాశాల, శ్రీచైతన్య, నారాయణ కళాశాలల్లో ఉదయం, సాయంత్రం ఈ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు రెండో విడత పరీక్షలు ప్రారంభమయ్యాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కామేశ్వరరావు తెలిపారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



పార్టీ నేతలతో సమావేశమైన వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మెంతిపేట గ్రామంతో పాటు కాలనీల్లో ఆదివారం పర్యటించిన ఆయన అక్కడి పార్టీ నేతలు, పలు సంఘాల పెద్దలను కలిసి, తనకు, పార్టీకి సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఈ నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మంచిని ప్రతీ ఇంటికి వివరించాలన్నారు. సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టీడీపీకి అవకాశమిస్తే పథకాలు కనుమరుగవుతాయన్న విషయం ప్రజలకు స్పష్టంగా చెప్పగలగాలన్నారు. అన్నివర్గాలకు పథకాల ద్వారా లబ్ధి జరిగిందన్నారు. లబ్ధిదారులందరి ఓటు వైఎస్సార్ సీపీకి పడేలా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు నాగేంద్ర, యందవ సూరి, యందవ చినబాబు, సత్యనారాయణ, ఆర్.జయరాం, అల్లెన జయలక్ష్మి, తోట తిరుమలరావు, శాసపు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ సన్నిధిలో రుద్రాక్ష స్వామీజీ



రుద్రాక్ష స్వామీజీకి రాములవారి ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

బొబ్బిలి: స్థానిక బజారులోని సీతారామ మందిరానికి అరుణాచల పుణ్యక్షేత్రం రుద్రాక్ష స్వామీజీ ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు సంఘ నాయకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులతో పూజలు చేయించి, స్వామి వారి ఆశీర్వచనాలు ఆయనకు అందజేశారు. అంతకుముందు ఆయన కళింగవైశ్య భవనంలో జరిగిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొని, భక్తి మార్గం అనుసరిస్తేనే మోక్షం లభిస్తుందని, ప్రతిఒక్కరూ దైవారాధనలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నారంశెట్టి, శ్రీనివాస్, సూర్యనారాయణ, కెంగువ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా ఓ మొక్క నాటి పరిరక్షించాలని రాజాం జీఎంఆర్ఐటీ ఎన్.ఎస్.ఎస్(నేషనల్ సర్వీస్ స్కీమ్) కార్యకర్తలు(విద్యార్థులు) అన్నారు. మండలంలోని తాటిపాడు గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు ఒక్కో మొక్క చొప్పున నాటి, మొక్కల సంరక్షణ బాధ్యతలను గ్రామ యువత తీసుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.వి.ఎస్.ప్రసాద్ వివరించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగానే గ్రామంలో మొక్కలు నాటామని, అవి పెరిగి పెద్దయ్యే వరకు కాపాడాల్సిన బాధ్యత గ్రామస్తులదేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



అప్పలనాయుడు మాస్టారు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తలే రాజేష్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేత రెడ్డి అప్పలనాయుడు మాస్టారు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం కలిసి పరామర్శించారు. అనంతరం అప్పలనాయుడు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా, మడ్డువలస ప్రాజెక్ట్ పోరాట కమిటీ సాధన సభ్యుడిగా, రాజాం నియోజకవర్గ రైతు సంఘం గౌరవాధ్యక్షుడిగా అప్పలనాయుడు మాస్టారు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఆయన లేకపోవడం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

• ఘంటసాల ధన్యుడు



బహుమతులు పొందిన విజేతలతో నిర్వాహకులు

రాజాం సిటీ: భగవద్గీత శ్లోకాలు పాడి, ఘంటసాల వెంకటేశ్వరరావు ధన్యుడయ్యాడని, ఆయన ఎన్నో సినిమా పాటలకు జీవంపోసిన మహానుభావుడని పద్మశ్రీ యడ్ల గోపాలరావు కొనియాడారు. ఘంటసాల 50వ వర్ధంతి పురస్కరించుకుని, స్థానిక బస్టాండ్ ఆవరణలోని కళాసాగర్ వేదిక వద్ద స్వరనీరాజనం, పాటల పోటీలు ఆదివారం నిర్వహించి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఘంటసాల తన గాత్రంతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారన్నారు. భగవద్గీత ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతుందంటే ఆయన ఘనతేనన్నారు. రాజాం ప్రాంతంలో ఆయన పేరుతో కళాశాల ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. అంతకుముందు నిర్వహించిన పాటల పోటీల్లో కెంబూరు తిరుపతిరావు, కుదమ తిరుమలరావు, నందూరి ప్రసాద్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించుకున్నారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. అనంతరం జబర్దస్త్ హాస్యనటుడు మల్లాన ఆదయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు బీవీ అచ్యుత్‌కుమార్, రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, కళాసాగర్ వేదిక అధ్యక్షుడు మెట్ట దామోదరరావు, ఘంటసాల కళాశాల ప్రిన్సిపాల్ మంతపూడి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.